క్లుప్తంగా

ఘనంగా పూర్ణానంద స్వామి జయంతి


అలంకరణలో పూర్ణనందస్వామి విగ్రహం

కళ్యాణదుర్గం: పట్టణ సమీపంలో వెలసిన పూర్ణానంద స్వామి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం స్వామిసీ నామజపం, హోమం చేపట్టారు. బుధవారం జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులుకావాలని నిర్వాహకులు కోరారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

ఉరవకొండ: సీపీఐ అనుబంధ కార్మిక సంఘం ఏఐటీయూసీ1 ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఉరవకొండలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత స్టేట్ బ్యాంకు ఆవరణలో తోపుడు బండ్ల యూనియన్, ఆటో, పారిశుధ్య కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ చేపట్టారు. తాలుకా సీపీఐ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, సహాయ కార్యదర్శి మనోహర్, వజ్రకరూర్ కార్యదర్శి సుల్తాన్ ఏఐటీయూసీ జెండా ఎగరేశారు. అలాగే నియోజకవర్గంలోని ఆమిద్యాల, కొనకొండ్ల, హవళిగి, విడపనకల్లులో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య నాయకురాలు వన్నూరమ్మ, తోపుడుబండ్ల యూనియన్ నాయకులు చక్రధర్, చెన్నారాయుడు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద అన్నదానం


అన్నదానం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప, వైఎస్సార్‌సీపీ నేత గౌని ఉపేంద్రరెడ్డి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోర్టు సమీపంలో ఉన్న బన్నీ మహంకాళి ఆలయం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏటా దసరా అనంతరం భక్తుల విరాళాలతో భక్తమండలి ఆధ్వర్యంలో అన్నదాన నిర్వహించడం ఆనవాయితీ. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ నాయకుడు గౌని ఉపేంద్రరెడ్డి, కౌన్సిలర్లు గౌని లావణ్య, పద్మజ హాజరై అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అంతకుముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వారు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలకు మంచి జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ పొరాళ్ల శివకుమార్, భక్త మండలి సభ్యులు రుద్ర తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి


మిరప పంటను పరిశీలిస్తున్న ఏపీడీ ఫసలున్నీసా బేగం

కళ్యాణదుర్గం రూరల్/బెళుగుప: ఉద్యాన పంటల్లో అధిక దిగుబడి సాధించాలంటే యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏపీఎంఐపీ ఏపీడీ ఫసలున్నీసా బేగం సూచించారు. కళ్యాణదుర్గం మండలంలోని ముదిగల్లు, తూర్పుకోడిపల్లి, గరుడాపురం, బెళుగుప్ప మండలంలోని దుద్దేకుంట, శీర్పి, గంగవరం గ్రామాల్లో మంగళవారం ఆమె పర్యటించారు.మిరప, అరటి తదితర పంటలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఏపీడీ మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం మిరపంట ఎక్కువగా సాగు చేశారన్నారు. అనంతరం పలు సచివాలయాల్లో సోషల్ ఆడిట్ జాబితాను పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి కృష్ణతేజ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, వీఏఏలు, సచివాలయ సిబ్బంది, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజ


అలంకరణలో గౌరసంద్రం మారెమ్మ

బెళుగుప్ప: మండలంలోని ఎర్రగుడి గ్రామంలో గౌరసంద్రం మారెమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ చేసి 41 రోజులు పూర్తి కావడంతో మంగళవారం మండల పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి బోనాలను సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

పేద రైతులకు సర్కారు బాసట

- ప్రభుత్వ భూములకు పట్టాలు సిద్ధం
- డివిజన్‌లో 340 మంది రైతులకు చేకూరనున్న లబ్ధి


సాగులో ఉన్న భూమి

రాయదుర్గం: పేద రైతులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. వారి సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తూ.. అన్ని రంగాల్లోనూ చెయ్యిపట్టి ముందుకు నడిపిస్తున్నారు. తాజాగా సాగు భూములకు పట్టాలు అందజేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కారణంగా రెవెన్యూ డివిజన్ పరిధిలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న సుమారు 341 మంది రైతులకు 526.44 ఎకరాలు పంపిణీకి జాబితాను సిద్ధం చేశారు. ఇప్పటికే అసైన్‌మెంట్ కమిటీ సమావేశం కూడా పూర్తయింది.

ఏళ్ల కల .. ఫలించిన వేళ

ఏళ్ల తరబడి ప్రభుత్వ భూములు సాగుచేస్తున్నా, వాటికి పట్టాలు లేక రైతన్నలు అనేక రాయితీలు వదులుకోవాల్సి వచ్చేది. రుణమాఫీ, పంట రుణం, ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ లాంటి పథకాలు దక్కేవి కావు. గత టీడీపీ హయాంలో సాగుదారుకు పట్టాలు ఇస్తామంటూ ఊరించి ఉసూరు మనిపించారు. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టాక రైతులకు అండగా నిలిచారు. సాగులో ఉన్న రైతులందరికీ పట్టాలు మంజూరు చేసేలా మార్గదర్శకాలు జారీచేశారు. ఎన్నో ఏళ్ల కల .. ఫలించేలా కృషి చేశారు. దీంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భూపంపిణీ జాబితా ఇలా..		
నియోజకవర్గం	లబ్ధిదారులు	ఎకరాలు
రాయదుర్గం	190	278.40
కళ్యాణదుర్గం	151	248.04

రైతు సంక్షేమానికి కృషి



అన్నదాతల సంక్షేమానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో మాత్రమే ఆర్‌బీకే లాంటి గొప్ప వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చి సాగు రంగానికి పెద్దపీట వేశారు. తాజాగా భూములుండి పట్టాలు లేని రైతులకు సాగు పట్టాలు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పేదలకు స్థిరాస్తిని సొంతం చేసే ఈ గొప్ప కార్యక్రమం త్వరలో సీఎం జగన్ చేతులమీదుగా ప్రారంభం కానుంది.
– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

భూ పంపిణీకి సర్వం సిద్ధం



పట్టాలు అందించే సాగుదారుల జాబితాను సర్వం సిద్ధం చేశాం. అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం కూడా పూర్తయింది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే పంపిణీకి ఏర్పాట్లు చేపడతాం. పట్టాల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రైతులకు ప్రయోజనం చేకూరనుంచి. వ్యవసాయంతో పాటు ఇక పై రుణమాఫీ, పంటరుణం, ఇతర రాయితీలు పొందవచ్చు. త్వరలో రైతు చేతికి పట్టాలు అందవచ్చు.
– రాణి సుష్మిత, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

‘జగనన్న గోరుముద్ద’ దేశంలోనే గొప్ప పథకం


గురుకుల పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అడ్వైజరీ కమిటీ మెంబర్ లక్ష్మణ్ కుమార్

కళ్యాణదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం పేద పిల్లల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ‘జగనన్న గోరుముద్ద’ దేశంలోనే గొప్ప పథకమని ఫుడ్ సేఫ్టీ అడ్వైజరీ కమిటీ మెంబర్ లక్ష్మణ్‌కుమార్ అన్నారు. కళ్యాణదుర్గం పర్యటనలో భాగంగా మంగళవారం మారెంపల్లి కాలనీలో ఉన్న ఎస్టీ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న పాలు, గుడ్లు, చికెన్ వంటి ఆహార పదార్థాలను పరిశీలించారు. అలాగే వసతిగృహం, మరుగుదొడ్లను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాలు, గుడ్లు సరిగా ఇవ్వడం లేదని చెప్పడంతో ప్రిన్సిపాల్ నాగరాజుపై మండిపడ్డారు. పేద పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ మేరకు భోజనం అందించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సాకే మోహన్, జీవీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు ధనుంజయ నాయక్, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

‘ఆరోగ్య సురక్ష’తో మెరుగైన వైద్యం


బ్రహ్మసముద్రం మండలం కోడిపల్లిలో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ వేణుగోపాల్ రెడ్డి

బ్రహ్మసముద్రం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని మండల స్పెషల్ ఆఫీసర్, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం బ్రహ్మసముద్రం మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముగింపు కార్యక్రమాన్ని పడమటి కోడిపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారికి కళ్లద్దాలు అందజేశారు. ఐడీసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఉన్న సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దాసా నాయక్, వైద్యాధికారి రాజేష్ , ఎంఈఓ క్రిష్ణానాయక్, సర్పంచ్ మమత, ఎంపీటీసీ నరసింహులు, పంచాయతీ కార్యదర్శి రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు మోహన్, మహేష్‌స్వామి, నాగరాజు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

శెట్టూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఒక వరమని మండల కన్వీనర్ శివన్న యాదవ్, సర్పంచ్ నాగరాజు అన్నారు. మంగళవారం మండలంలోని ములకలేడులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు సుమారు 500 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార పిరమిడ్ ఏర్పాటు చేసి ప్రజలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురామరావు, డాక్టర్ వేణుకార్తికేయ, తరుణసాయి, కోఆప్షన్ సభ్యులు మన్సూర్, నాయకులు శీన, రాజు, మూర్తి, కిష్టప్ప, నాగభూష్ణ, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం


కళ్యాణదుర్గం: వల్లభాయి పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు


ఉరవకొండ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


రాయదుర్గం రూరల్: జాతీయ ఐక్యతా దివస్ ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ కొండయ్య

కళ్యాణదుర్గం: మొట్టమొదటి ఉప ప్రధాని, హోం శాఖ మంత్రి సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి సందర్భంగా మంగళవారం జాతీయ సమైక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి ఆధ్వర్యంలో అధ్యాపకులు వల్లభాయి పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్‌కేసీ సేవా సమితి ఇన్‌చార్జ్ విద్యార్థుల నైపుణ్యాల కోసం ఒక కుట్టు మిషన్‌ను అందజేశారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర జిల్లా ఇన్‌ఛార్జ్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంపీ శేషయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రవిశంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాల విద్యార్థులు పాఠశాల నుంచి టీ సర్కిల్ వరకు వల్లభాయి పటేల్ చిత్రపటాన్ని ఊరేగిస్తూ ర్యాలీ చేశారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని వెస్ట్‌కోడిపల్లి గ్రామంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ సమైఖ్యదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ దాసానాయక్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టి జాతీయ సమైఖ్యత ప్రతిజ్ఞ చేయడం జరిగింది. కార్యక్రమంలో ఏఈఓ క్రిష్ణానాయక్ , సచివాలయ సిబ్బంది, వలంటీర్లు , అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఉరవకొండ: విద్యార్థులు సమైక్యతా భావాన్ని పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ రామకృష్ణ సూచించారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ప్రతిజ్ఞ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వెంకటరాముడు, అల్తాఫ్, అధ్యాపకులు పాల్గొన్నారు.అలాగే రూపానాయక్ తండాలో బంజారా ఫౌండేషన్ చైర్మన్ కమల్‌సింగ్ రాథోడ్ ఆధ్వర్యంలో గిరిజనులు మొక్కలు నాటారు.

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళం పరిధిలో ఉన్న కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రఘురామమూర్తి అధ్యక్షతన వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జాతీయ ఐక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు. అలాగే స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కొండయ్య అధ్యక్షతన జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

బెళుగుప్ప: స్థానిక జెడ్పీహెచ్ పాఠశాలలో హెచ్‌ఎం వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లబాయ్ పటేల్, ఇందిరాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

త్వరలో సచివాలయంలోనే రిజిస్ట్రేషన్లు

కూడేరు: త్వరలోనే మండలంలోని పి.నారాయణపురం సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ శేషారెడ్డి మంగళవారం తెలిపారు. భూసమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం చూపాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేసిన జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకం కింద రీ సర్వే కార్యక్రమాన్ని మండలంలోని పి.నారాయణపురం పంచాయతీలో ప్రారంభించామన్నారు. సిబ్బంది సమష్టి కృషి, రైతుల సహకారంతో 2,763 ఎకరాల విస్తీర్ణంలో రీ సర్వే విజయవంతంగా పూర్తి చేశామన్నారు. రీ సర్వే పూర్తి అయినందున ఆ పంచాయతీ సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టడానికి ఉన్నతాధికారులు అనుమతులిచ్చారని ఆయన తెలిపారు. పంచాయతీ కార్యదర్శి జాయింట్ రిజిస్ట్రార్‌గా ఉంటారని, ఈ నెలాఖరులోపే రిజిస్ట్రేషన్ చేసేలా చర్యలు చేపడతామన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన చందును అభినందిస్తున్న దృశ్యం

కుందుర్పి: మండలంలోని తెనగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి చందు రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికై య్యాడు. అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జరిగిన అండర్ -17 జిల్లా స్థాయి పోటీల్లో చందు ప్రతిభ కనబరిచారు. త్వరలో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొంటారు. కాగా తెనగల్లు పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో చందును హెచ్‌ఎం వరలక్ష్మి, పీఈటీ మహేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

తక్షణ సాయం పంపిణీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 23వ వార్డులో చాకలి రేణుకమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద రూ.10 వేలు తక్షణ ఆర్థికసాయాన్ని కౌన్సిలర్ పద్మజతో కలసి మంగళవారం చైర్‌పర్సన్ శిల్ప అందజేశారు. బీమా కింద మిగతా రూ.90 వేలు నామిని ఖాతాకు త్వరలో జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గౌని లావణ్య, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, రామాంజనేయులు, సచివాలయ సెక్రటరీ శ్రీనివాసులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విడపనకల్లు: మండలంలోని గడేకల్లులో గొల్ల కర్ణుడు (37) కామెర్ల వ్యాధితో మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను సచివాలయ సిబ్బందితో కలిసి ఎంపీపీ కరణం పుష్పావతి, సర్పంచు సుశీల, ఎంపీటీసీ ఓబుశేసు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి సోమయ్య, నాయకులు హంపయ్య, ఉమాశంకర్, ప్రసాదు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయండి

కుందుర్పి: ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్లను ఎంపీడీఓ వెంకట నాయుడు ఆదేశించారు. మండలంలోని మలయనూరు గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 820 జాబ్ కార్డులు ఉన్నాయన్నారు. అయితే 680 మంది కూలీలు మాత్రమే ఉపాధి పనులకు వస్తున్నారన్నారు. కూలీల సంఖ్యను పెంచి పనులు అడిగిన కూలీలందరికీ పనులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో టెక్నికల్ , ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన బోయ నాగమణి(50) కుటుంబ కలహాల కరణంగా సోమవారం ఆత్మహత్యాయత్నం చేసుకుంది. వివరాలు.. నాగమణికి(50) ముగ్గురు కూతుర్లు, కొడుకు ఉన్నారు. భర్త కొద్ది సంవత్సరాల క్రితం మృతిచెందాడు. కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతో గొడవ పడి, ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు


సమస్యలను ప్రస్తావిస్తున్న కౌన్సిలర్లు

రాయదుర్గంటౌన్: టీబీ డ్యాంలో నీటికొరతను దృష్టిలో ఉంచుకుని హెచ్చెల్సీ నుంచి ఎస్ఎస్ ట్యాంకు వేగవంతంగా నీటి పంపింగ్‌తోపాటు పట్టణంలో తాగునీటి కొరత రాకుండా ప్రత్యామ్నాయ చర్యలపై అధికారులు దృష్టి సారించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప సూచించారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత అజెండాలోని అంశాలను మున్సిపల్ సిబ్బంది చదివి వినిపించారు. అజెండా అంశాలపై కొందరు కౌన్సిలర్లు అనుమానాలను నివృత్తి చేసుకోగా బండి అజయ్, డిష్ గోవిందు, శ్రీనివాసరెడ్డి అభ్యంతరంతో 8వ అంశాన్ని వాయిదా వేసి అజెండాలోని మిగతా అంశాలన్నింటిని ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం జరిగిన జీరో అవర్స్‌లో పలువురు కౌన్సిలర్లు సమస్యలను అధికారులు, చైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా తుంగభద్ర డ్యాంలో నీటి లభ్యత తగ్గడంతో రెండు వారాల్లోగా హెచ్చెల్సీ కెనాల్‌కు నీటి విడుదల బంద్ చేస్తున్నట్లు అధికారులు ప్రకటిస్తున్న నేపథ్యంలో సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణానికి నీటి కొరత తలెత్త అవకాశం ఉన్నందున క్షేత్రస్థాయిలో నీటి పంపింగ్ వేగవంతం చేయాలని, మోటార్ల మరమ్మతు చేపట్టాలని, అవసరమైన సమయంలో నీటి పంపింగ్‌కు అన్ని ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, బండి అజయ్, పద్మజ తదితరులు అధికారులను కోరారు. వార్డుల్లో వీధి దీపాల కొరత తీర్చాలని శ్రీలక్ష్మీ, దేవరాజు అధికారులను కోరారు. 17వ వార్డులోని వెంకటేశ్వర కాలనీలో ప్రధాన డ్రైనేజీతోపాటు గడప గడప కింద అభివృద్ధి పనులు ప్రారంభించాలని కౌన్సిలర్ సాబిరాబీ కోరారు. కౌన్సిలర్లు చేసిన పనులకు బిల్లుల చెల్లింపు, తాము తెచ్చిన అంశాలపై అజెండాలో పొందుపరిచే విషయంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని కౌన్సిలర్లు శ్రీనివాసరెడ్డి, ఫక్రుద్దీన్ కౌన్సిల్‌లో ప్రస్తావిస్తూ అసహనం వ్యక్తం చేశారు. ఇదే విషయమై కొందరు కౌన్సిలర్లు, చైర్‌పర్సన్ మధ్య కాస్త వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాస యాదవ్, వలిబాషా, కమిషనర్ దివాకర్‌రెడ్డి, డీఈ సురేష్, మేనేజర్ ప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రాయంపల్లి లే అవుట్‌లో ప్లాట్ల కేటాయింపు

- నేడు లబ్ధిదారులకు అప్పగింత


పనులను పరిశీలిస్తున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ: కోర్టు వివాదంలో ఉంటూ క్లియరెన్స్ అయిన రాయంపల్లి లే అవుట్‌లోని 603 సర్వేనెంబర్‌లో మంగళవారం రెవెన్యూ అధికారులు నంబర్ రాళ్లు పాతి, వాటికి ప్లాటు నెంబర్లు కేటాయించారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ హరి ప్రసాద్, మండల సర్వేయర్ రత్నాకర్, సచివాలయ సర్వేయర్లు ప్లాట్ నంబర్ కేటాయింపు ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, వైస్ ఎంపీపీ నరసింహులు, ఉపసర్పంచ్ వన్నప్ప, పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, మండల సమన్వయకర్త ఓబన్న, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు మాట్లాడుతూ రాయంపల్లి లేఅవుట్‌లోని 603 సర్వేనెంబర్‌లో 300 మంది లబ్దిదారులకు బుధవారం అధికారులకు ప్లాట్లు చూపుతారన్నారు. లబ్దిదారులకు ఎక్కడా ఆలస్యం కాకుండా వెనువెంటనే ప్లాట్లు కేటాయిస్తున్నామన్నారు. కార్యక్రమానికి లబ్దిదారులు వచ్చి వారి ప్లాట్లు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో జోగి భీమా, అంగదాల ఆంజి, కమ్మటి రామాంజనేయులు, రాయల్ మల్లి తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులు వేగవంతం చేయండి


పాలవాయిలో రీ సర్వే పనులపై ఆరా తీస్తున్న ఆర్డీఓ రాణి సుస్మిత

కళ్యాణదుర్గం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే పనులు వేగవంతం చేయాలని ఆర్డీఓ రాణి సుస్మిత ఆదేశించారు. మండలంలోని పాలవాయిలో జరుగుతున్న రీ సర్వేను మంగళవారం ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో భూముల వివరాలు, రీ సర్వే పనులపై ఆరా తీశారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లో రీ సర్వేలో ఫేజ్ -3 కింద మొత్తం 52 గ్రామాలు తీసుకున్నామన్నారు. ఇందులో 9 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందన్నారు. మిగిలిన గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వాలిడేషన్ ప్రక్రియ జరుగుతోందన్నారు. పాలవాయి, హులికల్లు, చాపిరి గ్రామాల్లో రీ సర్వే పనులు జరుగుతున్నాయన్నారు. గడువులోపు రీ సర్వే పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, డివిజనల్ సర్వేయర్ సూర్యనారాయణ, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు. కాగా ఆర్డీఓ రాణి సుస్మితను గుమ్మఘట్ట తహసీల్దార్ బ్రహ్మయ్య, డీటీ, సర్వేయర్, వీఆర్వోలు మంగళవారం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో కలసి జ్ఞాపికను అందజేశారు.

పోలీసు అమరవీరులను స్మరించుకుందాం


కళ్యాణదుర్గం: టీ సర్కిల్‌లో కొవ్వొత్తులతో మానవహారం చేపట్టిన పోలీసులు, విద్యార్థులు


కూడేరు: కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ ప్రవీణ్ కుమార్, సిబ్బంది


కణేకల్లు: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థినులు

కళ్యాణదుర్గం: పోలీసు అమరవీరులను స్మరించుకుందామని కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రజల భద్రత, సమాజ రక్షణ కోసం ప్రాణాలు పణంగా పెట్టిన పోలీసు అమరవీరులను స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐలు శ్రీనివాసులు, హరినాథ్, ఎస్ఐలు నాగమధు, సుధాకర్, ఇతర మండలాల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కూడేరు: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి కూడేరులో అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై సీఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ సత్యనారాయణ ,పోలీసు సిబ్బంది, విద్యార్థులు,ప్రజలు పాల్గొన్నారు.

విడపనకల్లు: విడపనకల్లులో ఎస్ఐ తిప్పయ్య నాయక్ అధ్వర్యంలో మంగళవారం పోలీసుల అమరవీరుల సంస్మరణ, వారోత్సవాల్లో భాగంగా 42వ జాతీయ రహదారిపై యువకులతో కలసి 2కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానిక యువకులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో బాగంగా స్థానిక కేజీబీవీ విద్యార్థినులు, పోలీసులు 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణయ్య, కేజీబీవీ ఎస్ఓ నాగరత్న, హెడ్ కానిస్టేబుల్ నరసింహులు, పోలీసులు, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

కణేకల్లు: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి పోలీసులు, కళాశాల విద్యార్థినులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ దుగ్గిరెడ్డి, ఏఎస్ఐ ఈశ్వరయ్య, హెడ్ కానిస్టేబుల్ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.